సాక్షి
వికారాబాద్
గురువారం ❘ 4 ❘ మే ❘ 2023



ఇసుక దందా..!

పెద్దేముల్ మండలంలో ఇసుక అక్రమ దందా జోరుగా సాగుతోంది. రాత్రనక పగలనక యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. 8లో▸



రెగ్యులరైజ్ చేయాలి

కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణగౌడ్ అన్నారు. 8లో▸



పంటనష్టం పట్టని అధికారులు

భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచులు ఏఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 9లో▸

న్యూస్‌రీల్

గొర్రెల పెంపకందారులు డీడీలు చెల్లించండి



పశువైద్యాధికారి నిజానంద్

తాండూరు రూరల్: గొర్రెల, మేకల పెంపకందారులు వెంటనే డీడీలు చెల్లించాలని మల్కాపూర్ పశువైద్యాధికారి నిజానంద్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామాల్లో రెండో విడత గొర్రెల పంపిణీకి 473 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు కేవలం 100 మంది మాత్రమే డీడీలు చెల్లించారని, మిగతా వారు వెంటనే డీడీలు చెల్లించాలన్నారు. కలెక్టర్ పేరుపై డీడీలు చెల్లిం, డీడీ రశీదు, కులం, ఆధార్, బ్యాంక్ పాసు పుస్తకం తీసుకొని సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. ఒక్క యూనిట్‌కు డీడీ రూ. 43,750 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు

తట్టెపల్లిని మండలం చేయాల్సిందే



రిలే దీక్షలో పాల్గొన్న సాధన కమిటీ సభ్యులు, స్థానికులు

పెద్దేముల్: తట్టెపల్లిని మండల కేంద్రం చేయాలని పెద్దేముల్ మండలం తట్టెపల్లి సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. తట్టెపల్లి చౌరస్తాలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సభ్యులు గోపాల్, శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం తట్టెపల్లిని మండల కేంద్రం చేసే వరకు దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. గ్రామాన్ని చిన్నచూపు చూడటం తగదని, మంత్రులు చొరవ చూపాలని కోరారు. రెండేళ్లుగా పోరాడుతున్నా పాలకులు స్పందించడం లేదన్నారు. కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదని తెలిపారు. వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ తట్టెపల్లి రైతు సమన్వయ కో–ఆర్డినేటర్ ఏసప్ప, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు సోపి పటేల్, పండరి, బక్కప్ప, రాజు, నసీర్ , షబీర్, హిమ్రాన్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.


హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక



ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్‌శర్మ సమక్షంలో డ్రా పద్ధతిలో విద్యార్థుల ఎంపిక

వికారాబాద్ అర్బన్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ప్రవేశం కోసం ఆరుగురు విద్యార్థులను డ్రా పద్ధతిన ఎంపిక చేసినట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన 25 మంది గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా ఆరుగురిని డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన వారిలో కొక్కల సుదీక్ష, కెతావత్ అక్షిత, సభావత్ శిరీష, కండ్లి సాయి ప్రణవ్, జర్పుల మహాజన్, పాత్లవత్ మిథున్ లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆర్. కోటాజీ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు

మొయినాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా వైద్య సిబ్బంది చూడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. మొయినాబాద్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ఇప్పించేలా కృషి చేయాలన్నారు. ఆరోగ్య విషయాలు, వైద్య సేవలపై గర్భిణులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు అవసరమైన అన్ని మందులను సక్రమంగా అందించాలన్నారు.

కొనుగోళ్ల జాడేది?

అకాల వర్షాలు రైతులను అతలాకుతలం చేస్తుంటే.. అధికారులు మాత్రం ఇంకా వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టడంలేదు. చేతికొచ్చిన పంట నీటి పాలుకాకుండా రైతన్న పడుతున్న అవస్థలు అన్నీఇన్నీకావు.. సీజన్ ప్రారంభమైనా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పైన మొగులు.. వరి రైతుల్లో గుబులు

- జోరుగా నూర్పిడి పనులు
- కానరాని కొనుగోళ్ల కేంద్రాలు
- చర్యలు చేపట్టని అధికారులు



బొంరాస్‌పేట మండలంలో పొలంలో ఆరబెట్టిన ధాన్యం

బొంరాస్‌పేట: జిల్లాలో వరి పంట చేతికొచ్చి నూర్పిడి పనులు కొనసాగుతున్నాయి. రైతులు వరి కోతల పనుల్లో నిమగ్నమయ్యారు. యంత్రాలు, కూలీల సహాయంతో కోతలు కొనసాగుతున్నాయి. వాతావరణంలో అకాల వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. వరి రైతుల్లో ఆత్రుత మరింత ఎక్కువైంది. ఆదరాబాదరాగా కోతల్లో వరిరైతు కుటుంబాలు బిజీ అయ్యారు. పండించిన ధాన్యాన్ని మార్కెటుకు వెళ్లి అమ్ముకునేందుకు ఇదివరకు మండలంలోని ఆయా గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యేవి. కానీ ఈఏడాది వరి సీజన్ ప్రారంభమైనా ఇప్పటికీ ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల జాడలేదు.

120 కేంద్రాలు..

ఇదివరకు ఐకేపీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 120 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. బొంరాస్‌పేట మండలంలోని బొంరాస్‌పేట, నాగిరెడ్డిపల్లి, మెట్లకుంట, ఏర్పుమళ్ల తదితర గ్రామాల్లో మొత్తం 16 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. ప్రభుత్వ మద్దతు ధరకు ఎలాంటి అదనపు ఖర్చులు లేకుండా రైతులకు మేలుకరంగా కేంద్రాలుండేవి. ప్రభుత్వ మద్దతు ధరకు కల్పించి దళారి వ్యవస్థ లేకుండా ఉండేందుకుగానూ వరికొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేవారు. ఈసారి క్వింటాలుకు రూ.2060 వరకు మద్దతు ధర ఉంటుందని తెలుస్తోంది. ఇప్పటికైనా వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు కొనుగోళ్లు చేయాలని వరి రైతులు కోరుతున్నారు.

వారం రోజుల్లో ఏర్పాటు



వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ఇటీవల ఐకేపీ వారికి సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారులకు, సిబ్బందికి త్వరలో సమావేశం నిర్వహిస్తారు. మరో వారం రోజుల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు ఏ గ్రేడు రకానికి రూ.2060, సాధారణ రకానికి రూ.2040 ఉంటుంది.

– పద్మావతి, వ్యవసాయాధికారి, బొంరాస్‌పేట

త్వరలో పాస్‌పోర్టు ఇప్పిస్తా



తులసిని సన్మానిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

- క్రీడాకారిణికి మంత్రి భరోసా

కుల్కచర్ల: మండల క్రీడాకారిణికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ భరోసా ఇచ్చారు. తైవాన్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు పాస్‌పోర్టు త్వరగా ఇచ్చేలా చర్యలు చేపట్టారు. చౌడాపూర్ మండలం మరికల్ గ్రామానికి చెందిన కె.తులసి ధర్మాపూర్ ఎస్టీ గురుకులంలో 9వ తరగతి చదువుతోంది. బాలిక సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణించి తైవాన్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. తన సహచరులతో కలిసి తైవాన్‌లో జూన్ 10న జరిగే క్రీడల్లో పాల్గొనాల్సి ఉంది. కానీ తులసికి పాస్‌పోర్ట్ లేకపోవడంతో నూతనంగా దరఖాస్తు చేసుకోగా జూన్ 12న పాస్‌పోర్ట్ వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. దీంతో తైవాన్ వెళ్లేందుకు వచ్చిన అవకాశం చేజారుతుందని ఆవేదనకు గురవ్వగా బాలిక తండ్రి కిషన్ బుధవారం మహబూబ్‌నగర్‌లో మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను సంప్రదించి తమ ఆవేదనను తెలియపరిచారు. పాస్‌పోర్ట్ త్వరగా వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమని ఆయన ఈ సందర్భంగా తులసిని సన్మానించారు.

బ్యాంకు లింకేజీ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

చేవెళ్ల: మహిళా సంఘాలకు అందిస్తున్న బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం డివిజన్ స్థాయి అధికారులతో జేఎంఎల్‌బీసీ సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల శాఖల వారీగా బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళా సంఘాలకు అందించే బ్యాంకు లింకేజీ రుణాలను సకాంలో చెల్లించి సకాలంలో తిరిగి చెల్లింపులు జరిగేలా చూసుకోవాలన్నారు. గతంలో డివిజన్‌లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజురు చేసిన రుణాల్లో చేవెళ్లలో 30, శంకర్‌పల్లిలో 5, మొయినాబాద్‌లో 8, షాబాద్‌లో 13 చొప్పున రుణాలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే ఇవ్వాలని సూచించారు. బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం జీవై, పీఎంఎస్‌జీవై బీమా సౌకర్యాలు ప్రజలు ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పీఎంకిసాన్ పథకానికి రైతులంతా ఆధార్‌లింక్ చేయించుకునేలా చూడాలని చెప్పారు. సమావేశంలో చేవెళ్ల, షాబాద్ ఎంపీడీఓలు, ఏడీఏ, ఏపీఎంలు పాల్గొన్నారు.

సర్కార్ బడులకు ట్యాబ్‌లు

- ప్రతి పాఠశాల పూర్తి వివరాలు అందులోనే..
- జిల్లాకు చేరుకున్న 823 ట్యాబ్‌లు
- త్వరలో హెచ్‌ఎంలకు పంపిణీ



వికారాబాద్ అర్బన్: సర్కారు బడుల్లో మరింత పారదర్శకత పెంపొందించడం, సమగ్ర సమాచారం ఒకే చోట పొందుపరిచేందుకు ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మన ఊరు–మనబడి కార్యక్రమంతో మౌలిక వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం ప్రతి పాఠశాల సమగ్ర సమాచారం ఒకేచోట నిక్షిప్తం చేసేందుకు చర్యలు చేపట్టింది. పాఠశాలల వివరాలు అడిగినప్పుడు సమగ్ర సమాచారం సకాలంలో లభించక అసంపూర్తిగానే వివరాలు సమర్పించేవారు. ఇలాంటి ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం ముందుగా పీఎస్, యూపీఎస్ పాఠశాలలకు ట్యాబ్‌లను ఇచ్చేందుకు సిద్ధమైంది.

శిక్షణకు కసరత్తు

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 764, ప్రాథమికోన్నత పాఠశాలలు 116 ఉండగా జిల్లాకు ఇప్పటికే 823 ట్యాబ్‌లు వచ్చాయి. త్వరలో హెచ్‌ఎంలకు ట్యాబ్‌లను అందించడంతో పాటు, వాటిని ఎలా ఉపయోగించాలనే దానిపై శిక్షణ కూడా ఇచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. తక్కువ మంది విద్యార్థులు ఉన్న చోట ఒక ట్యాబ్, ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న చోట రెండు ట్యాబ్‌లు ఇవ్వాలని కూడా ఉన్నతాధికారులు నిర్ణయించారు. ప్రతి ట్యాబ్‌లో యూడైస్, ఎండీఎం వంటి యాప్‌లను వేసుకొని ఎలా ఉపయోగించాలనే దానిపై శిక్షణ ఇవ్వనున్నట్లు సమాచారం.

మరింత పారదర్శకత

ఈ ఏడాది జూన్ నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. గత విద్యా సంవత్సరం వరకు ఆయా పాఠశాలల వివరాలు, విద్యార్థుల హాజరును ఎండీఎం యాప్‌లో పొందుపర్చేవారు. ప్రతి రోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థుల సంఖ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థుల వివరాలను విడివిడిగా పొందుపర్చేవారు. ఈ వివరాలను అక్కడ పనిచేసే హెడ్‌మాస్టర్ లేదా ఇన్‌చార్జి సెల్ ఫోన్ నుంచి ఉదయం 10.30లోపే వివరాలు పంపించేవారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ప్రభుత్వం ట్యాబ్‌లను ఇచ్చేందుకు నిర్ణయించింది. ఇక మీదట ట్యాబ్ ద్వారానే రోజు విద్యార్థుల వివరాలను ఎండీఎం యాప్‌లో పొందుపార్చాల్సి ఉంటుంది. అంతేకాకుండా యూడైస్ యాప్‌ను ప్రధానంగా ట్యాబ్‌లో పొందుపర్చనున్నారు. పాఠశాలకు చెందిన సంపూర్ణ సమాచారం ఇందులో పొందుపర్చి ఉంటుంది. పాఠశాల విస్తీర్ణం, సర్వే నంబర్, తరగతి గదులు, విద్యార్థుల సంఖ్య, ఇతర ఫర్నిచర్, ఉపాధ్యాయుల సంఖ్య, ఎస్ఎంసీ కమిటీ వివరాలు, ట్యాబ్‌లో పొందపర్చాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లినా కొత్తగా వచ్చే వారికి ఆ పాఠశాల సమాచారం పూర్తిగా అందుబాటులో ఉండేలా ట్యాబ్‌లో నిక్షిప్తం అయ్యి ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. జూన్ మాసం తరువాత ఉపాధ్యాయులకు ఫేసియల్ అటెండెన్స్ కూడా అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

సమగ్ర సమాచారం కోసమే..



ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఒకే చోట ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ట్యాబ్‌లు ఇచ్చేందుకు నిర్ణయించింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పరీక్ష ఫలితాలు కూడా పొందుపరిచే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మన జిల్లాకు 823 ట్యాబ్‌లు వచ్చాయి. త్వరలో హెచ్‌ఎంలకు ఇస్తాం. వాటిని ఎలా ఉపయోగించాలనే విషయంపై కూడా త్వరలో శిక్షణ ఇస్తాం.

– రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి

ఏఎస్‌ఐల బదిలీలు



ఏఎస్‌ఐలతో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: జిల్లాలో ఏఎస్‌ఐలను బదిలీ చేశారు. ఈమేరకు బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కోటిరెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చి బదిలీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియారిటీ ప్రకారం పోస్టింగ్‌లు ఇచ్చామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ ప్రజలతో మమేకమై విధులు చేపట్టాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ మురళీధర్, ఏఓ వందన, డీపీఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భరోసా కేంద్రంలో పోస్టుల భర్తీకి చర్యలు

ఎస్పీ కార్యాలయంలోని భరోసా సెంటర్‌లో కాంట్రాక్టు పద్ధతిన రెండు ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. సెంటర్ కోఆర్డినేటర్ కమ్ సైకాలజిస్టు పోస్టు ఖాళీ ఉందన్నారు. వేతనం రూ.23వేలు చెల్లిస్తామన్నారు. సపోర్టు పర్సన్ పోస్టు ఖాళీ ఉందన్నారు. వేతనం రూ.18వేలు అందిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 15 సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఆయుర్వేదం.. నిర్వేదం



మూతపడిన రుద్రారం ఆయుర్వేద వైద్యశాల

- మూతపడిన ఆస్పత్రులు
- రోగులకు అందని మూలికా వైద్యం
- వైద్య సిబ్బంది నియామకంలో అలసత్వం

కొడంగల్ : నియోజకవర్గ పరిధిలోని ఆయుర్వేద వైద్యశాలలు మూతపడ్డాయి. ఫలితంగా ఆయుర్వేద వైద్యం అటకెక్కింది. మూలికా వైద్యం రోగులకు అందడం లేదు. వైద్య సిబ్బందిని నియమించడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో మూతపడిన ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి పూర్వ వైభవం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోక పోవడం వల్ల మూలికా వైద్యం అందడం లేదని స్థానికులు అంటున్నారు. రుద్రారం గ్రామం మండలంలోనే పెద్ద గ్రామ పంచాయతీ. 5 వేలకు పైగా జనాభా ఉంది. గ్రామస్తులకు ఆరోగ్య సమస్యలు వస్తే కొడంగల్‌కు వెళ్లాల్సి వస్తోంది. రుద్రారంతో పాటు నియోజకవర్గంలోని పలు ఆయుర్వేద వైద్యశాలలు వైద్యులు లేక మూతపడ్డాయి. పేదలకు వైద్యసేవలు అందించాల్సిన ఉన్నతమైన ఆశయం నీరుగారుతోంది. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో ఆరు ఆయుర్వేద వైద్యశాలలు ఉన్నాయి. అందులో కొడంగల్ మండలంలో రుద్రారం, అంగడిరాయిచూర్, బొంరాస్‌పేట మండలంలో బొంరాస్‌పేట, దుద్యాల, దౌల్తాబాద్ మండలంలో దౌల్తాబాద్‌లో ఆయుర్వేద వైద్యశాలలు ఉన్నాయి. వాస్తవానికి ఒక్కో దవాఖానాలో డాక్టర్, కంపౌండర్, అటెండర్ ఉండాలి. వైద్యులను, సిబ్బందిని నియమించకపోవడం వల్ల అవి మూతపడ్డాయి. దీంతో ఆయుర్వేదం వైద్యసేవలు అందడం లేదు. నియోజకవర్గంలోని ఆయుర్వేద ఆస్పత్రులపై పర్యవేక్షణ లేదు. పోస్టులు భర్తీ చేసి వైద్యం పేదలకు అందే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

మహమూదా.. జనం ఫిదా

- నోరూరిస్తున్న మామిడిపండ్లు
- 'వికారాబాద్' రకానికి డిమాండ్
- మన్నెగూడ ప్రసిద్ధి
- బెంబేలెత్తిస్తున్న ధరలు

పూడూరు: మామిడిపండ్ల సీజన్ ప్రారంభమైంది. నోరూరించే మామిడిపండ్లు మార్కెట్‌లోకి విరివిగా వచ్చాయి. పూడూరు మండల పరిధిలోని మన్నెగూడ గ్రామం మామిడిపండ్లకు ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో కాచే మామిడికి వికారాబాద్ మహమూదా అనే పేరు పెట్టారు. అంతేకాక రకరకాల మామిడి పండ్లు సైతం ఇక్కడ లభ్యమవుతాయి. ముఖ్యంగా దశేరి, చిన్నరసాలు, పెద్దరసాలు, బేనిషాన్, మల్గోబా, బంగినిపల్లి, తోతాపరి, లంగ్డా, సఫేదా తదితర రకాల పండ్లను విక్రయిస్తున్నారు. ఎలాంటి రసాయనాలు లేకుండా కాయలను మాటు వేసి సహజసిద్ధమైన పండ్లను విక్రయిస్తున్నారు. అయితే మామిడి పండ్లు సామాన్యులు కొనలేని విధంగా ధరలు రెట్టింపు అయ్యాయి. మామిడి పండ్లు విరివిగా దిగుబడి వచ్చేది. ప్రస్తుతం 60 శాతం మాత్రమే తోటలు కాశాయి. అందులో గాలివానలకు, చెట్లకు నీరందక అక్కడక్కడా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో వ్యాపారులు పండ్లను అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

ఫలోంకి రాజా ఆమ్..

మామిడి పండును ఫలోంకి రాజా అని పిలుస్తారు. పోషక విలువలు అధికంగా ఉండటంతో అన్ని పండ్లకంటే మామిడికి ప్రథమ స్థానం ఉంది. చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకు మామిడి పండు అంటే ఆసక్తి చూపుతారు. వివిధ రకాల పండ్లతోటలు వేల ఎకరాల్లో మన్నెగూడ ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి. హైదరాబాద్– బీజాపూర్ అంతర్రాష్ట్ర రహదారి పొడవునా స్టాళ్లను ఏర్పాటు చేసి వ్యాపారులు మామిడి పండ్లను విక్రయిస్తున్నారు.





మన్నెగూడలో ఏర్పాటు చేసిన మామిడిపండ్ల విక్రయ కేంద్రం (ఇన్‌సెట్‌లో..) మహమూదా రకం

విదేశాలకు ఎగుమతి...

ఇక్కడ పండించే మామిడి పండ్లను చుట్టు పక్కల ప్రాంతాలకు కాకుండా విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి చేస్తుంటారు. మహబూబ్‌నగర్, హైదరాబాద్, మెదక్, జిల్లాలే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, దుబయ్, తదితర ప్రాంతాలకు తరలిస్తుంటారు.

రకాన్ని బట్టి ధరలు

మామిడి పండ్ల రకాన్ని బట్టి ధరను నిర్ణయిస్తారు. కిలో ఒక్కింటికి బేనిషాన్ రూ. 70, దశేరి రూ.100, మల్లిక రూ. 80, గోవా రూ.120, తోతాపరి రూ.50, బంగినిపల్లి రూ.90, హిమాయత్ రూ.160, వికారాబాద్ మహమూదా రూ.100, రసాలు రూ.100, లంగ్డా రూ. 60, రసమల్లై రూ.80 ధరలు పలుకుతున్నాయి.

ఆశించినంత దిగుబడులు లేవు



మామిడి తోటలు చాలా ఉన్నా ప్రస్తుతం అనుకున్నంత మేర దిగుబడులు రాలేదు. దాదాపు 50 శాతం మాత్రమే కాత వచ్చింది. ఇందులో ఈదురుగాలులకు, వడగళ్ల వానలకు తోటలు చాలా వరకు దెబ్బతిన్నాయి. ఈసారి రూ.లక్షలు పెట్టి తోటలు ఖరీదు చేశాం. ఈ సంవత్సరం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. సహజ సిద్ధంగా తయారు చేసిన నాణ్యమైన పండ్లను మాత్రమే విక్రయిస్తున్నాం.

– పాషా, మామిడి పండ్ల వ్యాపారి

క్లుప్తంగా

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు

ఎమ్మెల్యే ఆనంద్



బొడ్రాయి స్థాపనలో ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

మోమిన్‌పేట: ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మొరంగపల్లిలో హనుమాన్ మందిర ధ్వజస్తంభ స్థాపన, బొడ్రాయి, నవగ్రహ విగ్రహాలు, ఊరడమ్మ, పోచమ్మ, నాదర్ లింగమయ్య విగ్రహాల ప్రతిష్ఠాపనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

తాండూరు టౌన్: రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి తాండూరు పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని కోకిల గార్డెన్ వద్ద ఉంటున్న మహ్మద్ షోయబ్(34) మంగళవారం రాత్రి ఇంటి నుంచి స్కూటీపై బయటికి వెళ్లాడు. గంగోత్రి పాఠశాల వద్ద పట్టణంలోకి రావడానికి యూటర్న్ తీసుకుంటుండగా సాయిపూర్ ప్రాంతానికి చెందిన విద్యార్థి రేహాన్ పటేల్ బైక్‌పై విలియంమూన్ చౌరస్తా నుంచి హైదరాబాద్ మార్గం వైపు వెళుతూ షోయబ్ స్కూటీని ఢీకొన్నాడు. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. షోయబ్ తలకు బలమైన గాయం కావడంతో తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెత్తకుప్పలో శిశు మృతదేహం



మోమిన్‌పేట: మండల కేంద్రమైన మోమిన్‌పేట ఎస్‌టీఓ కార్యాలయ ఆవరణ గోడ పక్కన చెత్త కుప్పలో మగ శిశువు మృతదేహం లభ్యమైంది. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన ఓ మహిళ శిశు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఐసీడీఎస్ అధికారులకు ఘటనా స్థలానికి చేరుకొని శిశు మృతదేహాన్ని మర్పల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలోనే మహిళ ప్రసవించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

బొంరాస్‌పేట: గోవింద, విష్ణు సహస్ర నామస్మరణతో శ్రీరాకమకొండ స్వామి దేవస్థానం 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. దుద్యాల మండలం హకీంపేటలో వెలసిన శ్రీరాకమకొండ స్వామి బ్రహ్మోత్సవాలు మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. బుధవారం వేడుకలు వైభవంగా ముగిశాయి. కార్యక్రమాలను తిరుమల తిరుపతి దేవస్థానం పురోహితులు రామాచారి, ఆలయ వ్యవస్థాపకులు ర్యాకం యాదయ్య, అరుణ, భక్తులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా ఇసుక దందా

- బిజ్వార్, మన్‌సాన్‌పల్లి వాగుల నుంచి తరలింపు
- సాయంత్రం 6గంటలకే రోడ్డెక్కుతున్న ఇసుక ట్రాక్టర్లు
- తెలిసినా పట్టించుకోని అధికారులు



ఇసుక అక్రమ రవాణా

పెద్దేముల్: మండలంలో ఇసుక అక్రమ వ్యాపారం జోరందుకుంది. అధికారుల సహకారం, రాజకీయ పలుకుబడితో యథేచ్ఛగా సాగుతోంది. సాయంత్రం ఆరు గంటలకే ఇసుక ట్రాక్టర్లు రోడ్డెక్కుతున్నాయి. ఈ విషయం రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది ఇసుక దళారులు ట్రాక్టర్‌కు కొంత డబ్బు చెల్లించి అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. గతంలో ఇసుక అక్రమ దందాపై అధికారులు ఏసీబీకి చిక్కినా అడ్డుకట్ట పడడం లేదు. మండలంలోని మన్‌సాన్‌పల్లి, కొండాపూర్, రుక్మాపూర్, యాలాల మండల బిజ్వారం వాగుల నుంచి ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. రెండు రోజుల క్రితం పెద్దేముల్ మండలం జనగాం గ్రామంలో మట్టి అక్రమ రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఇసుక వ్యాపారులు ఒక్కో ట్రాక్టర్‌కు రోజుకు రూ. 2వేల నుంచి రూ.3వేలు వరకు అధికారులకు ఇస్తున్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వ పనులకు ఇసుక అనుమతులు ఇవ్వాలని సర్పంచులు మండల సర్వసభ్య సమావేశాలలో మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథులు లేరు. దీంతో వారు వంద శాతం రోబో శ్యాండ్ వేసి రోడ్లు, మురుగు కాలువల పనులు చేస్తున్నారు.

ఆరు గంటలకే రోడ్లపైకి

ఇసుక అక్రమ వ్యాపారం చేసే వారు పగలంతా ట్రాక్టర్లకు నింపడం, స్టాక్ చేయడం, సాయంత్రం ఆరు గంటలు అయ్యాక రోడ్లపై వాలుతున్నారు. బహిరంగంగా మండల కార్యాలయం ముందు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. మన్‌సాన్‌పల్లి వాగు నుంచి ధారూర్‌తో పాటు పెద్దేముల్ మండలంలోని మారేపల్లి తండా మీదుగా కోటపల్లి, బంట్వారం మండలాలకు తరలిస్తున్నారు. అందుబాటులో ఉన్న గ్రామాలకు రూ. 4వేల నుంచి రూ.5వేలకు ట్రాక్టర్ ఇసుకను విక్రయిస్తున్నారు. దూరం ప్రాంతాలకు మరో ధరను నిర్ణయించి తరలిస్తున్నారు. ఏడాదిలో 9 నెలలు ఇసుక వ్యాపారం సాగుతుంది.

ఇసుక అడ్డా.. మంబాపూర్

ఇసుక అక్రమ వ్యాపారానికి మంబాపూర్ అడ్డాగా మారింది. మన్‌సాన్‌పల్లి, బిజ్వారం, రెగోండి గ్రామాల నుంచి వచ్చే ఇసుక ట్రాక్టర్లు మంబాపూర్ మీదుగా కుంచారం, బండమీదిపల్లి, తొరమామిడి, కోటపల్లి, బార్వాద్ తోపాటు పలు గ్రామాలకు వెళతాయి. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు దందా సాగిస్తారు. అంతేకాకుండా కాగ్నా పరీవాహక ప్రాంతంగా ఉన్న మదనంతాపూర్, రెగోండి, రుక్మాపూర్, ఖాంజాపూర్, కందనెల్లి ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. వాగుల సమీపంలోని పొలాల్లో కులీలకు వ్యాపారులు స్థావరాలు ఏర్పాటు చేసి దందా సాగిస్తున్నారు.

తనిఖీలు శూన్యం

ఇసుక, ఎర్ర మట్టి, సుద్ద అక్రమ రవాణాను అరికట్టాల్సిన రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయం ముందు నుంచే అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. సీజ్ చేసిన ట్రాక్టర్లకు నామమాత్రంగా జరిమానా విధించి చేతులు దులుపుకుంటున్నారు.

నిఘా పెంచుతాం



మండలంలో ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటాం. అధికారులకు దళారులు డబ్బులు ఇస్తున్నారన్న మాట అవాస్తవం. వారం వారం తనిఖీలు చేస్తున్నాం. ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి జరిమానాలు విధిస్తున్నాం. మన్‌సాన్‌పల్లి, రక్మాపూర్ ప్రాంతాల నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం ఉంది. నిఘా పెంచుతాం.

– అన్వేష్‌రెడ్డి, ఎస్ఐ, పెద్దేముల్

పోలీసుల చొరవతో ఆగిన బాల్య వివాహం

ధారూరు: మండలంలోని తరిగోపుల గ్రామంలో గురువారం జరగాల్సిన బాల్య వివాహాన్ని ముందస్తు సమాచారంతో పోలీసులు బుధవారం ఆపేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. తరిగోపుల గ్రామానికి చెందిన ఆర్ ఆనందం కూతురు(17) వివాహాన్ని హరిదాస్‌పల్లికి చెందిన సాయిలు కొడుకు విజయ్‌తో ఈ నెల 4న జరపాలని నిశ్చయించారు. పెళ్లికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామ సమీపంలోని ఆలయాలకు వెళ్లి పెళ్లి కూతురితో పూజలు చేయించారు. ఈ విషయం అధికారులకు తెలియడంతో గ్రామానికి చేరుకొని పెళ్లి ఆపేశారు. మరో 5 నెలలు ఆగితే బాలిక మేజర్ అవుతుందని అప్పుడు వివాహం చేయాలని కుటుంబ సభ్యులకు సూచించారు. పోలీసులు, రెవెన్యూ, చైల్డ్‌లైన్ సిబ్బంది బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్‌కుమార్, ఆర్ఐ వీరేశం, చైల్డ్‌లైన్ ప్రతినిధి సంజమ్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పెళ్లి పెద్దలతో మాట్లాడుతున్న ఎస్ఐ, చైల్డ్ లైన్ ప్రతినిధి

బావిలో పడి వ్యక్తి మృతి

మర్పల్లి: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి మద్యం మత్తులో బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కోట్‌మర్పల్లిలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బీ పెంటయ్య(55) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో మతిస్థిమితం కోల్పోయాడు. మంగళవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భోజనం చేసిన తరువాత ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. అర్ధరాత్రి వరకు రాకపోవడంతో భార్య ఎల్లమ్మ కుటుంబ సభ్యులకు చెప్పింది. వారు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం గ్రామానికి చెందిన మల్లారెడ్డి వ్యవసాయ పొలంలోని బావిలో విగత జీవిగా కనిపించాడు. దీంతో సర్పంచ్ విజయలక్ష్మి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. భార్య ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్ తెలిపారు.

ఎకరాకు రూ. 50వేల పరిహారం ఇవ్వాలి

రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి



రాజిరెడ్డి

బంట్వారం: వరుస అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ. 50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం రాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బంట్వారంలో ఆయన మాట్లాడారు. వడగళ్ల వానకు జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. పంట నష్టం భారీగా ఉన్నా ప్రభుత్వం కంటితుడుపు చర్యలతో సరిపెట్టడం సరికాదన్నారు. హార్టీకల్చర్, వ్యవసాయ శాఖల అధికారులు పంట నష్టం అంచనాలను సక్రమంగా రూపొందించలేదని ఆరోపించారు. మూడేళ్లుగా పంటలు నష్ట పోతున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పంట నష్ట పోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నా నాటి పరిస్థితులు కనిపించడం లేదన్నారు. తెలంగాణను జాతీయ విపత్తుగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలంటూ ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

వ్యర్థాల సేకరణకు వేలం



వేలం నిర్వహిస్తున్న కమిషనర్

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని చికెన్, మటన్, చేపల దుకాణాల్లో వ్యర్థాల సేకరణకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహించినట్లు కమిషనర్ శరత్‌చంద్ర తెలిపారు. వేలం పాటలో ఇద్దరు వ్యక్తులు పాల్గొన్నారని, అందులో మహమ్మద్ చాంద్ పాషా.. వ్యర్థాల సేకరణను అత్యధిక వేలం రూ. 75,000లకు దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ నెల నుంచి 11 నెలల కాలపరిమితికి గాను వేలం వేసినట్లు తెలిపారు.

ఖాతాదారుల డబ్బు స్వాహాపై విచారణ

యాచారం: తపాలా కార్యాలయంలో ఖాతాదారుల డబ్బు స్వాహాపై బుధవారం హైదరాబాద్ ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారి నర్మద విచారణ చేపట్టారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఖాతాదారులు తపాలా కార్యాలయంలో నెల నెలా జమ చేసే దాదాపు రూ. 30లక్షలకు పైగా యాచారం తపాలా శాఖ అధికారి రహిమాన్ స్వాహా చేశారు. ఖాతాదారుల ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారి నర్మద రికార్డులను తనిఖీ చేశారు. కొంత మంది ఖాతాదారులను, వివిధ గ్రామాలకు చెందిన తపాలా శాఖ సిబ్బందిని విచారించారు. ఖాతాదారులు జమ చేసే డబ్బులను కేవలం పాసు పుస్తకాల్లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంపై అనుమానం వచ్చిన ఖాతాదారులు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టినట్లు నర్మద తెలిపారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలియజేశారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయండి



సమ్మెకు సంఘీభావం తెలిపిన బీజేపీ నాయకులు

షాద్‌నగర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని బీజేపీ రాష్ట్ర నేత శ్రీవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వారికి బీజేపీ నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొన్ని రోజులుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జూనియర్, ఔట్ సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని, విధి నిర్వహణలో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు బాబయ్య, వెంకటేశ్, అశోక్, రుషికేశ్, నర్సింహ్మా, శివకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు యాదయ్య, స్వప్న, రవీందర్, శ్రీనివాస్, వెంకటేశ్, రాధాకృష్ణ, ధీరజ్ పాల్గొన్నారు.

శ్రీగంధం చెట్లు ఎత్తుకెళ్లే ముఠా అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ఉమామహేశ్వరరావు

వివరాలు వెల్లడించిన ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు

ఇబ్రహీంపట్నం: శ్రీగంధం చెట్లు నరికి దుంగలు ఎత్తుకెళ్లే ఐదుగురు సభ్యుల ముఠాను యాచారం పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు తన కార్యాలయంలో యాచారం సీఐ లింగయ్య కలసి నిందితుల వివరాలు వెల్లడించారు. ఇటీవల యాచారం శివారులోని రవీందర్ తోటలో, అలాగే శ్రీకాంత్‌రెడ్డి పొలం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు శ్రీగంధం చెట్లను నరికి ఎత్తుకెళ్లారు. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బుధవారం మాల్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తూ నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒక వ్యక్తి బావి వద్ద డంప్ చేసిన మూడు శ్రీగంధం దుంగలు, కారు, రెండు బైకులు, రంపం, రెండు గొడ్డళ్లు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. యాచారం గ్రామానికి చెందిన పీ నరేష్(30), కుర్మిద్దకు చెందిన ఎన్ రమేష్(35), ఎన్ శ్రీకాంత్ (32), ఎన్ సురేష్(35), లక్ష్మీగూడ, ఆర్‌జీకే కాలనీ, మైలార్‌దేవర్‌పల్లికి చెందిన షేక్ గులాం సైఫ్(29)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు అపహరణ

శంకర్‌పల్లి: గుర్తుతెలియని దుండగులు వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును అపహరించుకెళ్లిన ఘటన బుధవారం శంకర్‌పల్లిలోని సాయికాలనీలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం భానూరుకు చెందిన లక్ష్మి శంకర్‌పల్లిలో బంధువుల తొట్టెల కార్యక్రమంలో పాల్గొనడానికి తన కోడలు సరిత, మనుమడు పవన్‌తో కలిసి వచ్చింది. బస్సు దిగి సాయినగర్‌కు వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై హెల్మెట్ పెట్టుకొని వచ్చి లక్ష్మి మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. కోడలు సరిత, మనుమడు పవన్ దొంగను వెంబడించినా దొరక లేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ రష్మీ పెరుమాళ్, సైబరాబాద్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, నార్సింగ్ ఏసీపీ రమణాగౌడ్, శంకర్‌పల్లి సీఐ ప్రసన్నకుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి, సీసీఎస్ సీఐ నర్సింహా ఘటనా స్థలాన్ని సందర్శించారు. దొంగతనం జరిగిన తీరును తెలుసుకున్నారు. సీసీ కెమెరాల పుటేజీలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. త్వరలో దొంగను పట్టుకుంటామని పోలీసు అధికారులు తెలిపారు.

పల్లెల పరిశుభ్రత అందరి బాధ్యత

డీఎల్‌పీఓ శంకర్‌నాయక్



నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

తాండూరు రూరల్: పల్లెల పరిశుభ్రత అందరి బాధ్యతని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని మల్కాపూర్‌ను ఆయన సందర్శించారు. ముందుగా నర్సరీ, డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. గ్రామంలో ఎప్పటికప్పుడు మురుగు కాలువలను శుభ్రం చేయడం తోపాటు తడి, పొడి చెత్తను వేరు చేయాలని ఆదేశించారు. నర్సరీల్లో మొక్కలు పెంచాలని, వర్షాకాలం ప్రారంభం కాగానే మొక్కలు నాటాల్సి ఉంటుందన్నారు. మల్కాపూర్‌లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుదర్శన్ రెడ్డి, ఎంపీఓ రతన్‌సింగ్, గని కార్మిక సంఘం మాజీ వైస్ చైర్మన్ పండరి, పంచాయతీ కార్యదర్శి మోన్యా నాయక్, టీపీ జావేద్, కారోబార్ భీమయ్య, కాశీనాథ్ పాల్గొన్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి



జేపీఎస్‌లకు మద్దతుగా సమ్మెలో కూర్చున్న మురళీకృష్ణగౌడ్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణగౌడ్

బషీరాబాద్: కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జేపీఎస్‌లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం బషీరాబాద్‌లో జేపీఎస్‌ల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. కేసీఆర్ మాటలన్నీ నీటిమూటలే అన్నారు. హామీలను మరచిపోవడం కేసీఆర్‌కు అలవాటని మండిపడ్డారు. పంచాయతీల అభివృద్ధికి జేపీఎస్‌లు చేసిన కృషి మరచిపోరాదన్నారు.

ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

- రూ. 9.10లక్షల ముడిసరుకు సీజ్
- నిర్వాహకులపై కేసు



ఐస్‌క్రీంల తయారీకి వినియోగిస్తున్న అపరిశుభ్ర నీరు

ఆమనగల్లు: పట్టణంలో అనుమతి లేకుండా పరిశుభ్రత పాటించకుండా ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్న పరిశ్రమపై ఎస్ఓటీ పోలీసులు దాడులు చేశారు. రూ. 9.10 లక్షల విలువైన ఐస్‌క్రీం ముడిసరుకులు, వాహనాలను సీజ్ చేశారు. ఆమనగల్లు ఎస్ఐ సుందరయ్య కథనం మేరకు.. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వెనుక ఉన్న ఓ ఇంట్లో మెగా ఐస్‌క్రీమ్ పేరుతో ఐస్‌క్రీంలను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఐస్‌క్రీం తయారీకి అనుమతి లేదు. నాణ్యత పాటించడం లేదు. దీంతో మంగళవారం సాయంత్రం పరిశ్రమలో ఎస్ఓటీ పోలీసులు తనిఖీ చేశారు. పరిశ్రమకు ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో యజమాని ఎర్రబిక్య తండాకు చెందిన నేనావత్ నంగ్రియా, నిర్వాహకుడు వడ్త్యావత్ గోపీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రామచంద్రాపూర్‌లో..

కొందుర్గు: మండలంలోని రామచంద్రాపూర్‌లో అనుమతులు లేని ఐస్‌క్రీం తయారీ పరిశ్రమపై బుధవారం ఎస్ఓటీ పోలీసులు దాడులు చేశారు. ఐస్‌క్రీం తయారీలో నాణ్యమైన సరుకులు వాడకపోవడంతో పరిశ్రమను సీజ్ చేశారు.

బాత్‌రూమ్‌లో కాలుజారి పడి గర్భిణి మృతి



తేజస్విని (ఫైల్)

చేవెళ్ల: స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్లిన ఎనిమిది నెలల గర్భిణి కాలుజారి కింద పడి మృతి చెందింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండాలలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తిప్పని రాజేందర్‌రెడ్డి, తేజస్విని(29) దంపతులు. ప్రస్తుతం ఆమె 8 నెలల గర్భిణి. బుధవారం స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్లి కాలుజారి పడిపోయింది. చాలా సేపైనా తేజస్విని బయటకు రాలేదు. కుటుంబసభ్యులు ఎంత పిలిచినా పలుకలేదు. దీంతో తలుపులు పగులగొట్టి చూసే సరికి బాత్‌రూమ్‌లో కింది పడిపోయి కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే కడుపులో ఉన్న బిడ్డతోపాటు ఆమె మృతి చెందినట్లు తెలిపారు.

వ్యవసాయ పనిముట్ల దొంగలు అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు
- రూ. 2.80 లక్షల విలువ చేసే సామగ్రి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న వ్యవసాయ పనిముట్లు

మహేశ్వరం: పొలాలు, ఇళ్ల వద్ద నిలిపిన ట్రాక్టర్ నాగళ్లు, గుంటుకలను దొంగిలించే ఆరుగురు సభ్యుల ముఠాను మహేశ్వరం పోలీసులు అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ అంజయ్య కథనం మేరకు.. మహేశ్వరం మండలం కోళ్లపడకల్ గ్రామానికి చెందిన ఏ మహేందర్, అమీర్‌పేట్ గ్రామానికి చెందిన కే రాజు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరూ అప్పులు చేసి మద్యం, కల్లు తాగేవారు. తాగుడికి బానిసైన వీరు ట్రాక్టర్ల పరికరాలు నాగళ్లు, గుంటుకలను దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. శంషాబాద్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి సయ్యద్ ఖదీర్, మహ్మద్ యూనస్, మహ్మద్ మహబూబ్, మహ్మద్ అక్బర్ లతో కలసి వ్యవసాయ పనిముట్లు చోరీ చేశారు. పలు గ్రామాల్లో వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్ల పరికరాలు మాయమవుతుండడంతో ఇటీవల రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మంగళవారం సాయంత్రం మన్సాన్‌పల్లి చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ట్రాలీ ఆటోలో ఇనుక నాగళ్లు, గుంటుకలు తీసుకెళ్తుండగా వాహనాన్ని ఆపి విచారించారు. దీంతో అసలు విషయం బయటపడింది. తామే దొంగతనం చేశామని నిందితులు ఒప్పుకున్నారు. ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 2.80లక్షల విలువ చేసే నాలుగు ట్రాక్టర్ నాగళ్లు, నాలుగు గుంటుకలు, మూడు ట్రాలీ ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లను ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో మహేశ్వరం సీఐ మధుసూదన్, ఎస్ఐలు నర్సయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరిలో భక్తిభావం ఉండాలి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లి బొడ్రాయి పండుగలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పురాతన కాలం నుంచి గ్రామాల్లో బొడ్రాయి పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, తద్వారా మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, కాంగ్రెస్ నాయకుడు వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డు వద్ద చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ కథనం మేరకు.. మంచాల మండలం ఆగాపల్లికి చెందిన పీ నవీన్(25) ద్విచక్ర వాహనంపై ఇబ్రహీంపట్నంకు వస్తున్నాడు. అదే మార్గంలో వస్తున్న టాటా ఏస్ వాహనం వెనుక నుంచి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.